

ముగిసిన సెబ్ కథ



డోన్ సెబ్ స్టేషన్



నంద్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇసుక, గంజాయి, మద్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తమ ప్రభుత్వం కొత్తగా సెబ్‌ను (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో) తీసుకువస్తున్నామంటూ గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొచ్చింది. దీనికి కావాల్సిన సిబ్బందిని ఎక్సైజ్ శాఖ నుంచి తీసుకుంది. అయితే సెబ్ వచ్చిన తర్వాత జరిగిన మేలు ఏమిటో తెలియదు గానీ, గంజాయి, మద్యం వంటి వాటిని అరికట్టడంలో మాత్రం వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వైసీపీ చేసిన ఈ విఫల ప్రయోగాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించి, సెబ్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో సెబ్‌లో ఉన్న సిబ్బంది అంతా తమ మాతృశాఖకు వెళ్లనున్నారు. జగన్ తన సొంత లబ్ధి కోసం ఏర్పాటు చేసిన సెబ్ రద్దయి, పాత ఎక్సైజ్ విధానం మళ్లీ అమల్లోనికి రావడంతో సెబ్‌లోని ఉద్యోగులు అంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలో ఏడు సెబ్ స్టేషన్లు ఎక్సైజ్ శాఖలో విలీనం
- మాతృశాఖకు వెళ్లనున్న ఉద్యోగులు

ఉమ్మడి జిల్లాలో 14 సెబ్ స్టేషన్లు

గతంలో జగన్ ప్రభుత్వం జీవో నెంబరు 12 ద్వారా సెబ్‌ను తీసుకువచ్చారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 14 సెబ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలో నంద్యాల, డోన్, బనగానపల్లె, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, నందికొట్కూరు, ఆత్మకూరులో సెబ్ స్టేషన్లు ఉన్నాయి. ఈ స్టేషన్లలో దాదాపు 65 మందికి పైగా సిబ్బంది ఉన్నారు. ఈ సిబ్బందిని అంతటినీ ఎక్సైజ్‌శాఖ నుంచి తీసుకున్నారు. సెబ్ వచ్చిన తర్వాత ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమ రవాణా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, ఇసుక అక్రమ రవాణా తగ్గిన దాఖలాలు లేవు. ఇక ప్రభుత్వం తీసుకువచ్చిన సెబ్ వల్ల పాత ఎక్సైజ్ శాఖ నుంచి వచ్చిన అధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తమ ఇబ్బందిని గత వైసీపీ ప్రభుత్వానికి విన్నవించుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం రాగానే గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు సరిదిద్దే పనిలో పడింది. ఇందులో భాగంగా సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్‌ను పునర్వవస్థీకరించాలని భావించింది. గత నెల 28వ తేదీన మంత్రి వర్గ సమావేశంలో నిర్ణయం తీసుకుని పాత ఎక్సైజ్ విధానానికి మళ్లీ ఊపిరిపోసింది. దీంతో సెబ్‌లో పనిచేస్తున్న ఎక్సైజ్ సిబ్బందిని వెంటనే తమ మాతృశాఖకు పంపాలని, సెబ్‌కు చెందిన స్టేషన్లలోని పర్నీచర్, వాహనాలు, కంప్యూటర్లు, వివిధ కేసుల్లో జప్తు చేసిన వాహనాలు, సామగ్రిని కూడా ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఇక నుంచి ఎక్సైజ్ స్టేషన్లు

ఎన్నో ఏళ్ల నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఉంది. ఈ శాఖ సమర్థవంతంగా పనిచేసేది. అయితే గత జగన్ ప్రభుత్వం మాత్రం ఈ శాఖను పూర్తిగా మద్యం విక్రయించేందుకు పరిమితం చేసింది. ఇక ఎక్సైజ్‌శాఖ మీద పోలీసు అజమాయిషీ కూడా ఉండేది. దీంతో ఎక్సైజ్ శాఖ దాదాపుగా నిర్వీర్యం అయిపోయిందన్న విమర్శలు అప్పట్లో బలంగా వినిపించాయి. అయితే పాత ఎక్సైజ్ విధానాన్ని కూటమి ప్రభుత్వ పునరుద్ధరిస్తుండటంతో ఎక్సైజ్ శాఖ మళ్లీ పటిష్టంగా మారనుంది. గతంలో మాదిరిగా కేసుల నమోదుకు ఎక్సైజ్ స్టేషన్లకు అధికారం రానుంది. ప్రతి స్టేషనుకు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌వోగా ఉంటారు. ఒక్కో స్టేషనుకు ఇద్దరు ఎస్సైలు, ముగ్గురు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 10 నుంచి 12 మంది కానిస్టేబుళ్లను నియమించనున్నట్లు సమాచారం. వీటితో పాటు గతంలో సెబ్‌కు కేటాయించిన విధులు, బాధ్యతలను తిరిగి ఎక్సైజ్‌కు అప్పగించనున్నారు. సెబ్‌కు కేటాయించిన ఆస్తులు ఎక్సైజ్ శాఖ పరిధిలోకి రానున్నాయి.



ప్రభుత్వ మద్యం దుకాణం

మళ్లీ ప్రైవేటు మద్యం దుకాణాలు?

గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే ప్రైవేటు మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రభుత్వ మద్యం దుకాణాలను తీసుకువచ్చింది. ఈ దుకాణాల్లో నాణ్యమైన సరుకును తీసివేసి వైసీపీ నాయకులకు చెందిన నాసిరకం సరుకును అమ్మటం మొదలుపెట్టింది. దీంతో వైసీపీ నాయకులు జేబులు నిండాయి తప్పించి ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం సమకూరలేదు. ఇక ఈ నాసిరకం మద్యం తాగి చాలామంది అనారోగ్యం బారిన పడటమే కాకుండా, చాలామంది తనువు చాలించిన ఘటనలు కూడా ఉన్నాయి. ఇదంతా జగన్ చేసిన తప్పిదాలని గుర్తించిన కూటమి ప్రభుత్వం పాత మద్యం దుకాణాల విధానంపైన కూడా దృష్టి సారించింది. ఇప్పటికే ఎక్సైజ్ శాఖను పాత విధానంలోకి తీసుకువస్తోంది. కాబట్టి వచ్చే నెల 1వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీని కూడా తీసుకువచ్చేందుకు యోచిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు మద్యం పాలసీ మీద అనేక రాష్ట్రాలలో ఉన్న విధానాన్ని ఇప్పటికే అధ్యయనం నివేదిక కూడా ఇచ్చారు. నూతన మద్యం పాలసీ విధానం ప్రకారం దుకాణాలకు టెండరు విధానం అమలులోనికి తీసుకువచ్చే ఆలోచనస్తోంది. దీంతో జగన్ జమానాలో వచ్చిన ప్రభుత్వ మద్యం దుకాణాలు రద్దు అయి ప్రైవేటు దుకాణాలు రానున్నాయి. ప్రైవేటు దుకాణాలకు ఈ వేలం విధానం అమలు చేసే అవకాశముందని తెలుస్తోంది. జిల్లాలో ఎన్ని దుకాణాలను ఏర్పాటు చేయాలనే విషయంపై కూడా ఇప్పటికే కసరత్తు ప్రారంభమైనట్లు సమాచారం.

శ్రీశైల జలాశయానికి తగ్గిన ఇన్‌ఫ్లో



శ్రీశైల జలాశయం

శ్రీశైలం, సెప్టెంబరు 14: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శనివారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. జూరాల నుంచి 55,465 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 17,916 క్యూసెక్కులు మొత్తం 73,381 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 75,895 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.00 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 210.0320 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31094 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

కుటుంబ విషయంలో గ్రామస్థుల జోక్యం

ఇంటికి తాళం వేస్తామంటూ బెదిరింపు



ఇంటి ముందు తాళం వేస్తామంటూ కూర్చున్న గ్రామస్థులు

నంద్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల్లో గ్రామస్థులు జోక్యం చేసుకొని ఇంటికి తాళం వేస్తామంటూ బెదిరింపులు చేసిన వీడియో నెట్టింట వైరల్ అయింది. ఈ ఘటన పగిడ్యాల మండలం పాత ముచ్చుమర్రిలో శనివారం చోటు చేసుకుంది. పాతముచ్చుమర్రి గ్రామంలో ఓ మహిళ భర్త చనిపోవడంతో మరో వ్యక్తితో సహజీవనం చేస్తోంది. వేరే వ్యక్తితో సహజీవనం చేస్తున్న ఆమెకు పింఛన్ ఇవ్వకుండా రద్దు చేయాలంటూ ఆమె మామ నిలదీశాడు. గ్రామ పెద్దల వద్ద పంచాయితీ పెట్టడంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆమె సహజీవనం చేస్తున్న వ్యక్తి ఇంటి వద్దకు వెళ్లారు. గ్రామపెద్దలు పిలుస్తున్నారు రావాలని, లేదంటే ఇంటికి తాళం వేస్తామని బెదించారు. ఈ విషయాన్ని ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి ఎస్పీకి పంపారు. ముచ్చుమర్రిలో ఏమి జరుగుతుందో తెలుసుకోవాలని ఆత్మకూరు డీఎస్పీని ఎస్పీ ఆదేశించారు. డీఎస్పీ ఆదేశాల మేరకు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను పరిశీలించారు. ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు.

ఆందోళన వద్దు: కలెక్టర్



ఆళ్లగడ్డలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్నకలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 14: డయేరియా అదుపులో ఉందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఎమ్మెల్యే అఖిలప్రియతో కలిసి డయేరియా కేసులు ఉన్న ఆదర్శ అభ్యుదయ కాలనీ, సద్దాం కాలనీ, చాంద్ వీధుల్లో శనివారం కలెక్టర్ పర్యటించారు. పట్టణంలో ఎక్కడ నీరు కలుషితమైనట్లుగా రిపోర్టు రాలేదని అన్నారు. నిమజ్జనం రోజున చిత్రాన్నం తినడం వల్ల ఒక్క కుటుంబంలో మాత్రమే డయేరియా వచ్చిందని తెలిపారు. డయేరియా ప్రబల కుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టాంటాం ద్వారా తెలియజేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మీడియా బాధ్యతగా ఉండాలని అన్నారు. డయేరియా వ్యాధిగ్రస్తులను పట్టించుకోవడం లేదని, బెడ్లు లేవని ఇష్టం వచ్చినట్లుగా రాతలు రాయడం సరికాదన్నారు. రాష్ట్రమంతా బాగుందని, ఆళ్లగడ్డ ఐసీయూలో ఉందని రాయడం బాధాకరమన్నారు. పత్రికలు, చానల్స్ బాధ్యతగా ఉండాలని ఆమె కోరారు. ఇమాంబి(70) కిడ్నీ సమస్యతో, మాబుసా (75) గుండెపోటుతో మృతి చెందారని తెలిపారు. చంద్రమోహన్(48)కు డయేరియా సోకినా వైద్యశాలకు రాలేదని అన్నారు. 90 ఏండ్ల వృద్ధురాలు సహజ మరణం పొందితే డయేరియా కింద చనిపోయిందని పత్రికల్లో ఎలా రాస్తారని ప్రశ్నించారు. ఆళ్లగడ్డలో డయేరియా బారిన పడి చనిపోయినట్లు అనుకుంటున్న మూడు కుటుంబాలను ఎమ్మెల్యే అఖిలప్రియ, కలెక్టర్ రాజకుమారి శనివారం పరామర్శించారు. అధైర్య పడొద్దని వారికి భరోసా ఇచ్చారు.

పెరిగిన ఉల్లి ధర

క్వింటం గరిష్ఠ ధర రూ.4,211



కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 14: ఉల్లి ధర రోజురోజుకు భారీగా పెరిగిపోతోంది. శనివారం రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లి ధర గరిష్ఠంగా రూ.4,211కు చేరింది. ఒక్కరోజులోనే క్వింటానికి రూ.600 దాకా పెరగడంపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మధ్యస్థ ధర రూ.3,210, కనిష్ఠ ధర రూ.297 రైతులకు దక్కింది. గత పది రోజులుగా వర్షాలకు ఉల్లిగడ్డలు పూర్తిగా తడిసి కుళ్లిపోయాయని, అందువల్లనే నాణ్యత లేని ఉల్లికి రూ.297 మాత్రమే రైతులకు అందినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ గోవింద్ తెలిపారు.

అంతా మా ఇష్టం

- ఇష్టానుసారంగా గోదాముల నిర్మాణాలు
- సహకార సొసైటీలకు అప్పగించని వైనం



జూపాడుబంగ్లాలో నిర్మించిన గోదాము



జూపాడుబంగ్లా, సెప్టెంబరు 14: అంతా తమ ఇష్టమన్నట్టుగా గోదాములు నిర్మించారు. ఒక గ్రామానికి మంజూరైన గోదామును స్థలం కొరత పేరుతో మరో ఊరిలో నిర్మించారు. ఇలా ఇష్టారాజ్యంగా గోదాముల నిర్మాణాలు చేపట్టారు. దీనికితోడు నిర్మించిన గోదాములను కాంట్రాక్టర్లు సొసైటీలకు అప్పగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. నందికొట్కూరు నియోజకవర్గంలో మొదటి విడతగా పది గోదాములు నిర్మించడానికి అనుమతులు వచ్చాయి. నందికొట్కూరు మండలానికి 2, జూపాడుబంగ్లా మండలానికి 2, మిడుతూరు మండలానికి 5, పగిడ్యాల మండలానికి ఒకటి చొప్పున నిర్మాణాలు చేపట్టారు. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములకు రూ.40 లక్షలు, వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాముల నిర్మాణాలకు రూ.75 లక్షలు కేటాయించారు.

స్థలాలు లేవని..

జూపాడుబంగ్లా మండలానికి రెండు గోదాములు మంజూరు కాగా వీఆర్వో స్థలం లేదని చెప్పారు. దీంతో పారుమంచాలలో ప్రభుత్వ స్థలం ఉందని అక్కడ నిర్మించారు. మండ్లెంలో స్థలం లేదని చెప్పడంతో ఆ గోదామును మండల కేంద్రం జూపాడుబంగ్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద నిర్మించారు. వాస్తవంగా మండ్లెంలో జగనన్న కాలనీలో ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉన్నా జూపాడుబంగ్లాలో నిర్మించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. నందికొట్కూరు మండలంలో కొణిదేల, నాగటూరు గ్రామాలకు మంజూరైన గోదాములను నాగటూరు పొలిమేరలోనే నిర్మించారు.

రైతులకు ఉపయోగపడని గోదాములు

నియోజకవర్గంలోని ఏ ఒక్క గోదాము కూడా రైతులకు ఉపయోగపడటం లేదు. ప్రధానంగా రైతులు మన ప్రాంతంలో మొక్కజొన్న, కందులు, శనగలు అధిక దిగుబడులు సాధిస్తారు. గిట్టుబాటు ధర వచ్చే వరకు ప్రైవేటు గోదాములను ఆశ్రయిస్తారు. నిర్మించిన ప్రభుత్వ గోదాములు ఉపయోగంలోకి తీసుకు రావాలి.

మా గ్రామానికి గోదాము వచ్చినట్టే తెలియదు



గ్రామానికి గోదాము వచ్చినట్టే మాకు తెలియదు. గ్రామానికి మంజూరైన గోదామును జూపాడుబంగ్లాలో ఎలా నిర్మిస్తారు. అధికారులు, కాంట్రాక్టర్ల కుమ్మక్కుతో ఇలా జరిగింది. ఇంటి స్థలాలకు కేటాయించిన స్థలాల వద్ద ప్రభుత్వ స్థలం ఉంది. ఇక్కడే నిర్మించి ఉంటే మొక్కజొన్న రైతులకు నిల్వ ఉంచుకోవడానికి చాలా ఉపయోగపడేది.

- పెద్దతిరుపాలు, మండ్లెం రైతు



వైసీపీ నాయకుల అక్రమాలకు అంతే లేదు



మండ్లెం గ్రామానికి మంజూరైన గోదామును ఎలా జూపాడుబంగ్లాలో నిర్మిస్తారు. గ్రామంలో ప్రభుత్వ స్థలం ఉన్నా వైసీపీ నాయకులు, రెవెన్యూ అధికారుల అవినీతి అక్రమాలు ఎక్కడ బయట పడుతుందోనని గ్రామంలో నిర్మించకుండా రైతులకు అన్యాయం చేశారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలి.

- మోహన్‌రెడ్డి, టీడీపీ మండల నాయకులు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

నియోజకవర్గంలో మొదటి విడత మంజూరైన గోదాముల నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటిని ఇంకా అప్పగించలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు ఉపయోగపడేలా చేస్తాం.

- వెంకటరమణ, సహకార బ్యాంకు మేనేజర్

ధర పతనం

మిరప పంటను దున్నేస్తున్న రైతులు



జూపాడుబంగ్లాలో మిరప పంటను దున్నేస్తున్న రైతు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 14: పచ్చి మిరప ధర పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కిలో మిర్చి ఏడు రూపాయాలకు పడిపోయింది. పచ్చిమిరప కాయలు తెంచడానికి కూలీ ఒక్కొక్కరికి రూ. 250 నుంచి రూ.300 ఉండటంతో మిరపకాయలు అమ్మిన కూడా కూలీలకు డబ్బులు సరి పోక అప్పుతెచ్చి ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొందని మిరపరైతులు వాపోతున్నారు. ధర లేకపోవడంతో జూపాడుబంగ్లా, తంగడంచ గ్రామాల్లో మిరప తోటలను రైతులు దున్నేస్తున్నారు. మండలంలో వందల ఎకరాలు సాగుచేసి అధి కంగా పెట్టుబడులు పెట్టడం వెరసి ధరలేకపోవడంతో రైతులు దిక్కుతోచడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ధర కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

రూ. 2.5 లక్షల అప్పులయ్యాయి



రెండు ఎకరాలు రూ.40వేలకు కౌలుకు వేసుకుని పచ్చిమిర్చి సాగుచేశాను. మూడుకోతలు కోసిన కూడా కిలో ఏడు రూపాయల కంటే పెరగడంలేదు. పంట అమ్ముకున్న కూడా కూలీలకు సరిపోగా అప్పుతెచ్చి ఇవ్వాల్సి వస్తుంది. మూడుకోతలు కోసిన నష్టమే. రెండెకరాలు సాగుచేయడానికి ఇప్పటికే రూ.2.5 లక్షలు ఖర్చుచేశా. అప్పే మిగిలింది

.- మనోహర్‌రెడ్డి, జూపాడుబంగ్లా

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు

వేలాదిగా తరలివచ్చిన భక్తులు



మఠం ప్రాంగణంలో భక్తులు

మంత్రాలయం, సెప్టెంబరు 14: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం దక్షిణాది రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రెండో శనివారం, ఆదివారం, సోమవారం వరుసగా మూడు రోజులు సెలవు దినాలు కావడంతో ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో మంత్రాలయం మఠం ప్రాంగణం, మధ్వమార్గ్ కారిడార్ కిక్కిరిసింది. క్యూలో ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. నదితీరం, ప్రధాన రహదారులు, బస్టాండు ప్రాంతం, రాఘవేంద్రసర్కిల్ భక్తుల రద్దీ కనిపించింది. భక్తులకు గదులు దొరక్క ఇబ్బందులు పడ్డారు.

లోక కల్యాణార్థం సుదర్శన హోమం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో శనివారం లోక కల్యాణార్థం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. భాద్రపద శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని వేలాదిమంది భక్తులకు స్తప్త ముద్ర ధారణ చేసి భక్తులను ఆశీర్వదించారు.

మహిళా సాధికారత కేంద్రాన్ని అభివృద్ధి చేస్తాం

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



సమస్యలు తెలుసుకుంటున్న కర్నూలు ఎంపీ నాగరాజు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 14: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణంలో ఉన్న ఎన్టీఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మహిళా ప్రాంగణం అభివృద్ధికి సహకరిస్తామని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం ఆయన మహిళా సాధికారత కేంద్రాన్ని ఎంపీ పరిశీలించారు. ఈ కేంద్రంలో అభాగ్యులైన మహిళలకు ఎన్నో సేవలు అందుతున్నాయని , నిధుల కొరత ఉందని అధికారి అంజనీభూషణ్ ఎంపీ దృష్టికి తీసుకునిరాగా, తన సొంత ఖర్చులతో సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ఆసుపత్రి నుంచి నీరు ప్రాంగణంలోనికి ప్రవహిస్తుందని ఎంపీకి ఫిర్యాదు చేశారు. సీఎస్ఆర్ నిధుల కింద ప్రాంగణంను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ శిక్షణలు నిర్వహించేలా కలెక్టర్‌తో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ వీరశైవ సాధికారత సమితి కన్వీనర్ ఎస్‌వీ శివరాజు, మల్లికార్జునప్ప, చంద్రశేఖరప్ప, వీరశేఖరప్ప, రాజేంద్రప్రసాద్, ఉపేంద్ర గౌడు పాల్గొన్నారు.

కర్నూలు కేంద్రంగా కాంగ్రెస్ పాలన



పీసీసీ ప్రధాన కార్యదర్శిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 14: వైసీపీ తరహాలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల కాంగ్రెస్ పాలన కర్నూలు కేంద్రంగా సాగుతుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి మూసాని శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం రెండు జిల్లాల డీసీసీ అధ్యక్షులు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్, పరిగెల మురళీకృష్ణలతో పలు అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి ఆస్తులు ఎన్ని ఉన్నాయి. నెలా నెల అద్దె రూపంలో సమకూరుతున్న లెక్కలు.. ఇంత వరకు దేనికి ఖర్చు చేశారు.. ఇకపై ఎలా నిధుల వాడలో అనే దానిపై పలు సూచనలు చేశారు. ఆదాయంలో నుంచి రెండు జిల్లాలకు ఖర్చు చేయాల్సిన అవసరం ఉందని, అధిష్టానం సూచించిందని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేసేందుకు ఉమ్మడి జిల్లాలు ఒకే కార్యచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. అంతక ముందు నగర అధ్యక్షుడు షేక్ జిలానీ ఆధ్వర్యంలో మూసాని శ్రీనివాస రెడ్డిని శాలువతో సన్మానించారు. సేవాదళ్ జిల్లా అధ్య క్షురాలు వెంకటసుజాత, సత్యనారాయణ గుప్త, నాయకులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో ఆళ్లగడ్డ వాసి గల్లంతు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 14: అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు గ్రామ శివారులో ఉన్న హెచ్చెల్సీ కాలువలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన ఓ వ్యక్తి గల్లంతైన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన మేరకు శనివారం ఏకాదశి సందర్భంగా నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన రాజ్‌కుమార్(51) అనే వ్యక్తి ఉంతకల్లు గ్రామంలోని రుక్మిణీపాండురంగస్వామి ఆలయానికి తులసీమాల ధరించేందుకు వచ్చాడు. స్నానం చేసేందుకు హెచ్చెల్సీలో దిగి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. రాజ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రాజెక్టుల రూపకర్త మోక్షగుండం

- ప్రపంచ ఖ్యాతి నిర్మాణాలు చేపట్టిన గొప్ప వ్యక్తి విశ్వేశ్వరయ్య
- నేడు ఇంజనీర్స్ డే



కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 14: దేశంలోనే తొలిసారిగా నీటి వృధాను అరికట్టేందుకు బ్లాక్ సిస్టమ్‌కు రూపకల్పన చేసిన వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. అలాగే వర్షపు నీటిని ప్రాజెక్టుల ద్వారా నిలుపుదల చేయడం, ప్రవహించే నీటిని ఆనకట్టలు, ఉక్కు తలుపుల ద్వారా అరికట్టడానికి రూపకల్పన చేశారు. కొన్ని క్షణాల్లో ఈ వంతెన కోల్పోతుంది.. రైలును ఆపండి.. అంటూ కేకలు వేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన మేధావి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన జయంతిని పురస్కరించుకొని 1968 నుంచి సెప్టెంబరు 15వ తేదీని ఇంజనీర్స్ డే జరుపుకుంటున్నాం. ఇంజనీరింగ్ రంగంలో ఆయన చేసిన కృషికి గానూ భారత ప్రభుత్వం విశ్వేశ్వరయ్యను 1955లో భారతరత్న బిరుదుతో సత్కరించింది.

ప్రపంచ ఖ్యాతి నిర్మాణాలు

ఆధునిక భారతదేశంలో ఆనకట్టలు, రిజర్వాయర్లు, హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టుల నిర్మాణంలో విశ్వేశ్వరయ్య కీలక పాత్ర పోషించారు. ఇంజనీర్‌గా మనదేశ ఖ్యాతిని నలుదిశలా చాటారు. ఈ రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించి ప్రపంచ ఖ్యాతి నిర్మాణాలను ఆవిష్కరించారు. ఆయన మార్గదర్శకత్వంలో నిర్మాణాలు నేటికీ చెక్కు చెదరలేదు. విశాఖపట్నం సాగరతీరం నుంచి రక్షించే వ్యవస్థను రూపొందించి చిరస్మరణీయుడిగా చరిత్రలో నిలిచిపోయారు. ఆసియాలోనే మొదటి విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు నెలకొల్పారు. అంతేకాదు కోట్లాది మంది భక్తులు ప్రయాణించే తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. హైదరాబాదును వరదలు ముంచెత్తుతున్న సమయంలో నైజాం సూచనల మేరకు ఉస్మాన్‌సాగర్ హిమయత్ సాగర్ జలాశయాలు నిర్మించారు. దేశంలోని కొన్ని పట్టణాలలో మంచినీటి పథకాల నిర్మాణాలకు రూపకల్పన చేశారు. దేశంలోనే తొలి ఉక్కు కర్మాగారం నిర్మించారు. మైసూరులో కృష్ణరాజు సాగర్ నిర్మించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు.

విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేపట్టిన నిర్మాణాలు నేటికీ చెక్కు చెదరలేదు. ప్రతి ఇంజనీరింగ్ విద్యార్థి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి.

డా.జి.రఘురామ్, ప్రొఫెసర్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం, జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, కర్నూలు

ఇంజనీర్లకు మార్గదర్శకం



ఆంగ్లేయులు చేత ప్రశంసలందుకున్న గొప్ప వ్యక్తి మోక్షగుండం విశ్వేశ్వరయ్య. నవభారత నిర్మాణంలో ఎంతో కృషి చేశారు. ప్రతి విద్యార్థి ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలి.

- ఆర్.రవీంద్ర, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

సత్తా చాటితే విజేతలు మీరే

- డిగ్రీ విద్యార్థులకు ఆర్బీఐ క్విజ్ పోటీలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 28 వేల మంది డిగ్రీ విద్యార్థులు
- 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

శిరివెళ్ల, సెప్టెంబరు 14: విద్యార్థుల్లోని మేధోశక్తిని పరీక్షించేందుకు.. చదువుతూనే లక్షాధికారులయ్యే అవకాశాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) అందిస్తోంది. ఆర్బీఐ స్థాపించబడి 90 సంవత్సరాలైన సందర్భంగా ఆర్బీఐ-90 పేరుతో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు దేశ వ్యాప్తంగా క్విజ్ పోటీలను నిర్వహిస్తోంది.

ఇలా దరఖాస్తు చేసుకోవాలి : గుర్తింపు పొందిన కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈ క్విజ్ పోటీలకు అర్హులు. సెప్టెంబరు 1, 2024 నాటికి 25 సంవత్సరాల వయస్సు ఉండాలి. ఆసక్తి, అర్హత కలిగిన డిగ్రీ విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఆర్బీఐ90క్విజ్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్‌లో స్టూడెంట్స్ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేసి రాష్ట్రం, జిల్లా, చదువుతున్న కళాశాలతో పాటు విద్యార్థుల పేర్లు, ఫోన్ నెంబర్, ఈ మెయిల్ ఐడీ తదితర వివరాలు నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో నమోదకు గాను విద్యార్థులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. విద్యార్థులు ఒక్కో బృందానికి ఇద్దరు చొప్పున దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

19వ తేదీ నుంచి 21 వరకు పోటీలు : ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 19వ తేదీ నుంచి 21 వరకు (ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 వరకు) క్విజ్ పోటీలు జరుగుతాయి. క్రీడలు, చరిత్ర, సైన్స్ అండ్ టెక్నాలజీ, సమకాలీన, వర్తమాన వ్యవహారాలు, ఆర్ట్ అండ్ లిటరేచర్, ఆర్థిక వ్యవస్థ తదితర అంశాలపై ప్రశ్నలుంటాయి. ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రశ్నలు ఇస్తారు. నాలుగు దశల్లో నిర్వహించే ఈ క్విజ్ పోటీల్లో మొదట జిల్లా, రాష్ట్రం, జోనల్ అనంతరం జాతీయస్థాయిలో ఫైనల్ పోటీలను నిర్వహిస్తారు.



యర్రగుంట్ల డిగ్రీ కళాశాల విద్యార్థులు

వరద బాధితులకు యునైటెడ్ క్లబ్ చేయూత



మంత్రికి చెక్కును అందజేస్తున్న యునైటెడ్ క్లబ్ ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సహాయార్థం కర్నూలు యునైటెడ్ క్లబ్ కార్యవర్గ కమిటీ రూ.2 లక్షలు అందించాలని తీర్మానించింది. ఈమేరకు శనివారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌కు నగరంలోని మౌర్య ఇన్‌లోగల ఆయన కార్యాలయంలో రూ.2లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కర్నూలు యునైటెడ్ క్లబ్ అధ్యక్షుడు కె.భీమేశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. బలరాం, కోశాధికారి ఎస్.సుధాకర్ బాబు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు వై. ఏసురత్నం, వి. రాముడు, సభ్యులు రాంభూపాల్ రెడ్డి, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 14: విజయవాడలోని వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని మంత్రి చాంబ ర్‌లో కర్నూలు క్లబ్ అసోసియేషన్ రూ.5 లక్షలు అందజేశారు. కర్నూ లు నియోజవర్గం టీడీపీ 4వ వార్డు తరపున వార్డు ఇన్‌చార్జి రమేష్ బాబు, బూత్ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలలో సేకరించిన రూ.60 వేలు, 48వ వార్డు 3వ బూత్ ఇన్‌చార్జి కేఈ మధులతాగౌడ్ రూ.30 వేల విరాళం చెక్కుల అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ బాల చంద్రారెడ్డి, జాయింట్ సెక్రటరీ చంద్రమౌళీశ్వరరెడ్డి, ట్రెజరర్ కేఈ శివరామ్ గౌడ్, కార్తీక్, బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం లారీ పట్టివేత.. 250 బస్తాలు స్వాధీనం

నంద్యాల క్రైం, సెప్టెంబరు 14 : నంద్యాల నుంచి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న బియ్యం బస్తాల లారీని పట్టుకున్నట్లు టూ టౌన్ సీఐ ఇస్మాయిల్ శనివారం తెలిపారు. బియ్యం బస్తాల లారీని స్థానిక మునిసిపల్ కార్యాలయ సమీపంలో పట్టుకొని అందులోని 250 బస్తాలను సీజ్ చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన నగేషును అదుపులోకి తీసుకొని విచారించగా రేషన్ బియ్యాన్ని నంద్యాలలో అక్రమంగా సేకరించి అక్రమ రవాణాకు పాల్పడి సొమ్ము చేసుకుంటున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చీటింగ్ కేసులో వ్యక్తికి రిమాండ్

నంద్యాల క్రైం, సెప్టెంబరు 14 : ఓ చీటింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రీనివాస హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కటకం భరత్‌కుమార్‌ను శనివారం అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. అరెస్ట్ చేసి జడ్జి ఎదుట హాజరుపరచగా 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఇదే కేసులో పరారీలో ఉన్న మరికొందరి కోసం గాలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్రగాయాలు

జూపాడుబంగ్లా/మిడుతూరు, సెప్టెంబరు 14: వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటనలు జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల్లో చోటు చేసుకున్నాయి. జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ గ్రామ సమీపంలోని కేజీరోడ్డుపై శుక్రవారం రాత్రి ఎదురెదురుగా మోటారుసైకిళ్లు ఢీకొని తంగడంచ గ్రామానికి చెందిన మాదన్న, తాటిపాడు గ్రామానికి చెందిన చెన్నరాయుడు, తిక్కస్వామి గాయపడ్డారు. 108లో కర్నూలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే మిడుతూరు మండల పరిధిలోని అలగనూరు గ్రామ సమీపంలో బైక్‌పై నుంచి అదుపు తప్పి కింద పడి విద్యపోగుల దేవరాజు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బంధువు అంత్యక్రియల్లో పాల్గొని సొంత గ్రామానికి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకున్నది. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో మిడుతూరు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స నిర్వహించి కర్నూలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గోల్డ్ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 14 : అన్సర్ డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెల్లరీ ఎగ్జిబిషన్‌ను నంద్యాలలోని సౌజన్య ఫంక్షన్ హాల్‌లో శనివారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ముఖ్య అతిథులుగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన గోల్డ్, డైమండ్స్‌ను వారు తిలకించారు. వారు మాట్లాడుతూ అన్సర్ జ్యువెల్లరీ నాణ్యతతో, నమ్మకమైన గోల్డ్ డైమండ్లను అందించడం అభినందనీయమన్నారు. మార్కెట్‌తో పోల్చుకుంటే సరసమైన ధరలకే నాణ్యతతో కూడిన బంగారు ఆభరణాలు అన్సర్ జ్యువెల్లరీ ప్రత్యేకత అని అన్నారు. మూడురోజుల పాటు ఈ ఎగ్జిబిషన్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ కేంద్ర పాలక సభ్యుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ గంగిశెట్టి విజయకుమార్, విశ్వనాథరెడ్డి, మిద్దె ఉసేని, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో హ్యాండ్ రిటన్ బైబిల్‌కు స్థానం

160 మంది మహిళతో హ్యాండ్ రిటన్ బైబిల్

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 14: ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానంలో బైబిల్ రీడింగ్ చాలేంజ్ టీమ్ ఇండియా సభ్యులు సాధించారని ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి రాజ్ లూత్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక నగర శివారులోని పుల్లారెడ్డి కాలేజీ సమీపంలో ఆర్‌సీ కన్వెన్షన్ (రేమా చర్చ్)లో దేశ నలుమూలల నుంచి వచ్చిన 160 మంది మహిళలు పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌ను 8 గంటల వ్యవధిలో రాశారని తెలిపారు. ఇది ప్రపంచంలోనే మొదటిసారి నమోదైన రికార్డు అని నిర్వాహకులు జూలి ఫ్రాన్సిస్ కందుకూరి, మేరీ జోష్న కందుకూరి, గొటికల బ్యూలా పాలిన్, మేరీ ప్రశాంతి కందుకూరి తెలియజేశారు. ఈ సందర్భంగా దేశ నలుమూలల నుంచి పాల్గొన్న 160 మంది మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి రాజ్ లూత్ర

నిందితుల అరెస్టు

పెద్దకడుబూరు, సెప్టెంబరు14: మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి కేసులో పదిమందిని నిందితులను అరెస్టు చేసినట్లు శనివారం ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హనుమాపురం గ్రామ సమీపంలోని, కల్లుకుంట గ్రామంలోని చాకలి భూలక్ష్మి, చాకలి నరసమ్మ, చాకలి లక్ష్మి, చాకలి పెద్దరంగమ్మ, చాకలి నాగరాజు, చాకలి హుసేని, చాకలి రాముడు, చాకలి భీమరాజు, చాకలి గుండమ్మను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మండలంలో 30యాక్టు అమలులో ఉంటుందని పోలీసులు చెప్పారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

నందికొట్కూరు, సెప్టెంబరు 14: నందికొట్కూరు పట్టణ శివారులో ఉన్న పోతురాజు కుంటలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి మృతి చెందాడు. ఏబీఎం పాలెంకు చెందిన ప్రకాశం(65) శనివారం వ్యవసాయ పనుల్లో భాగంగా నీటి కోసం పోతురాజు కుంట వద్దకు వెళ్లి అందులో పడి పోయాడు. పక్క పొలం వారు సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలుపగా కుంటలో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని సాయంత్రం వెలికితీశారు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, భార్య ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోసిగి, సెప్టెంబరు 14: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశారు. కోసిగి మండల కేంద్రంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లను మైనింగ్ అధికారులకు అటాచ్ చేశామన్నారు. ఎవరైనా అక్రమ ఇసుక తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

గుర్రప్ప స్వామి ఆలయంలో చోరీ

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 14: మండలంలోని ఇంజేడు గ్రామంలో ఉన్న గుర్రప్ప స్వామి ఆలయంలోని హుండీని పగలగొట్టి అందులోని నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఉదయం గ్రామానికి చెందిన గుర్రప్ప ఆలయంను శుభ్రం చేసేందుకు వెళ్లిగా హుండీ తాళం పగిలిపోయి అందులోని నగదు మాయం అయినట్లు గర్తించాడు. హుండీలో గత రెండేళ్ల క్రితం రూ. 55,550 నగదు, ఇత్తడి వస్తువులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. దాని అంచనాను బట్టి ఇప్పుడు కూడా రూ. 50 వేలకు పైబడి నగదు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఎస్ఐ రామాంజనేయరెడ్డిని వివరణ కోరగా సమాచారం మేరకు విచారణ చేపట్టామని తెలిపారు.

ప్రతి ఎకరాకు సాగు నీరు

- ఎస్ఆర్‌బీసీ నుంచి మంచాలకట్ట చెరువుకు నీటి విడుదల
- అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.34 కోట్లు మంజూరు: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



మోటారును ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గడివేముల, సెప్టెంబరు 14: ప్రతి ఎకరాకు సాగునీరు అందించి అన్నదాతకు అండగా ఉంటామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. మండలంలోని మంచాలకట్ట చెరువుకు శనివారం ఆమె ఎస్ఆర్‌బీసీ నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం మోటార్లు చెడిపోయిన గత పాలకులు పట్టించుకోలేదని అన్నారు. రైతులకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో టీడీపీ నాయకులు, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, మురళీమోహన్‌రెడ్డిలు తమ సొంత నిధులు రూ.లక్ష వెచ్చించి రెండు మోటార్లను మరమ్మతులు చేయించారని అన్నారు. ఈ మోటార్ల ద్వారా మంచాలకట్ట చెరువుకు ఎస్ఆర్‌బీసీ నీటిని విడుదల చేసి మంచాలకట్ట, గని, తలమొడిపి, గడివేముల గ్రామాలకు చెందిన దాదాపు 3 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టడంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు రూ.34 కోట్లు నిధులు మంజూరు చేసిందని అన్నారు. త్వరలో వెలగమాను ఫీడర్ చానల్ నిర్మాణాన్ని చేపట్టి కేసీ కెనాల్ చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందిస్తామని అన్నారు. ప్రస్తుతం ఉసేనాపురం నుంచి బ్రాహ్మణపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ డబుల్ రోడ్డును గడివేముల వరకు వేయాలని ప్రతిపాదనలు పంపించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే గడివేములలో బైపాస్ నిర్మాణ ఆవశ్యకతను మంత్రి దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. విజయవాడలో వరద బాధితులకు అండగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ ఎస్‌పి రఫిక్, పంట రామచంద్రారెడ్డి, గని హర్షవర్దన్, కృష్ణయాదవ్, భాస్కర్‌రెడ్డి, సుభద్రమ్మ, వడ్డు లక్ష్మీదేవి, రాజునాయక్, గిరిబాబు, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ఆత్మకూరు, సెప్టెంబరు 14: ఆత్మకూరులో 20వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం జాబ్‌మేళా బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. సంస్థ అధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ 20న జరిగే ఈ జాబ్‌మేళాకు లోకల్ యాప్, ఐసీఐసీఐ బ్యాంకు, మహేంద్ర ఫైనాన్స్, అరబిందో ఫార్మ, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్ తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు కల్పించనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, పీజీ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాకు హాజరు కావచ్చునని చెప్పారు. మరిన్ని వివరాలకు 9182217075, 6300324076 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న ఉన్నారు.

ఎంపీ శబరితో ఇరిగెల సోదరుల భేటీ



ఎంపీ శబరితో మాట్లాడుతున్న ఇరిగెల సోదరులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 14 : నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరితో శనివారం నంద్యాలలోని ఎంపీ కార్యాలయంలో ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి, జనసేన అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణరెడ్డిలు సమావేశమయ్యారు. ఆళ్లగడ్డలో ప్రస్తుత రాజకీయాలు, ఉమ్మడి ప్రభుత్వం చేయాల్సిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, నామినేటెడ్ పోస్టులపై, ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు తదితరాలపై చర్చించారు. సమావేశంలో జనసేన నాయకులు జున్ను ప్రసాదరెడ్డి, ఇరిగెల జయేంద్రారెడ్డి ఉన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



మాట్లాడుతున్న నాగరాజు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 14 : ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం నంద్యాలలోని ఎస్టీటీఎఫ్ కార్యాలయంలో సమావేశం జరిగింది. నాగరాజు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మధ్యంతర భృతి ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి నిర్ణీత కాలపరిమితిలోపు నివేదిక తెప్పించి అమలు చేయాలని కోరారు. ఎస్టీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ డీఈవో ఆధీనంలో ఉన్న భాషాపండితుల సమస్యకు పదోన్నతులు కల్పించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. 117 జీవోను రద్దుచేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాము, సుధాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయం హర్షణీయం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పోలీసులు

ఆత్మకూరు, సెప్టెంబరు 14: వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను రద్దు చేసి ఎక్సైజ్‌శాఖలో విలీనం చేస్తూ ప్రస్తుతం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బీ మారుతీరావు పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సీఎం చంద్రబాబు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయం నందు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎక్సైజ్‌శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను వేరుచేసి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోగా ఏర్పాటు చేయడం వల్ల శాఖపరమైన సమస్యలు ఉత్పన్నం కావడమే కాకుండా ప్రజలకు కూడా శాఖల పట్ల సరైన అవగాహన లేకపోయిందని అన్నారు. అయితే ఎక్సైజ్ శాఖకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖను ఎక్సైజ్ శాఖలో విలీనం చేయడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజశేఖర్, సిబ్బంది మనోహర్, శంకర్ నాయక్, నాగరాజు, రమేష్, జగదీష్, రంగస్వామి ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నంద్యాలరూరల్, సెప్టెంబరు 14: నంద్యాల రైతు నగరానికి చెందిన ఉరుకుంద అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రైత నగరం సమీపంలోని వక్ఫ్ భూమిలో తాను నిర్మంచుకున్న భవనాన్ని శనివారం అధికారులు తొలగించేందుకు వచ్చారు. అయితే తాను అన్నీ అనుమతులతోనే భవన నిర్మాణాన్ని చేపట్టానని, మునిసిపల్ అధికారులకు, వక్ఫ్ అధికారులకు నిర్మాణం కోసం కొంతమేర కమీషన్లు ముట్టజెప్పానని ఆరోపించాడు. తన భవనాన్ని ఎలా కూలుస్తారంటూ భవనం పైకి ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న తాలుకా పోలీసులు ఉరుకుందకు నచ్చజెప్పే ప్రయ త్నం చేశారు. మంత్రి ఫరూఖ్ తనకు హామీ ఇస్తే గానీ కిందకు దిగనంటూ పట్టుబట్టాడు. పోలీసులు నచ్చజెప్పటంతో కిందకు దిగిన ఉరుకుంద అధికారులు ప్రవర్తనతో తన వద్ద ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే అధికారులు తేరుకుని ఉరుకుందను నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వరద బాధితులకు విరాళాలు



ఎమ్మెల్యే బుడ్డాకు విరాళం చెక్కును అందజేస్తున్న రేడియం నూర్

ఆత్మకూరు, సెప్టెంబరు 14: విజయవాడలో సంభవించిన వరదలతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. శనివారం ఆత్మకూరు పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి రేడియం నూర్ రూ.1,00,116, ఆత్మకూరు పెద్ద మద్రసా మదీన తుల్ ఉలుం కమిటీ తరుపున నాయకులు ఎంఏ.రషీద్, అబ్దుల్‌వహాబ్, రహంతుల్లా, మహబూబ్‌బాషా, మాజీ మున్సిపల్ ఛైర్మన్ శివపురం నూర్‌మహ్మద్ బృందం వారు రూ.లక్ష, ఎమ్మార్పీఎస్ నాయకులు రాబిన్‌సన్‌రాజు, బుజ్జి, దరగయ్య తదితరులు రూ.45వేల చొప్పున విరాళం అందజేశారు. ఈమేరకు సంబంధిత వివరాళాలను వెలుగోడు మండలంలోని వేల్పనూరులోలోని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ.. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.

నంద్యాల రూరల్: వరదలకు నష్టపోయిన బాధితులకు చేయూతగా నిలిచేందుకు నంద్యాలలోని రావూస్ విద్యాసంస్థల ఛైర్మన్ ఏఎంవి అప్పారావు ముందుకు వచ్చారు. శనివారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు సీఎం సహాయ నిధికి రూ.లక్ష చెక్కును అప్పారావు, ఆ విద్యాసంస్థల డైరెక్టర్ మోనిచంద్ర అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, కళాశాల ప్రిన్సిపాల్ సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: వరద బాధితులకు టీడీపీ శ్రేణులు విరాళాలు ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్‌రెడ్డికి అందజేశారు. శనివారం మండలంలోని ఎర్రగుంట్ల టీడీపీ నాయకులులు రూ.2,30,000లు, పెద్దదేవళాపురం నుంచి రూ.75 వేలు, అలాగే కృష్ణనాయక్ సొంతంగా రూ.25వేలు, బీ కోడూరు నుంచి రూ.1,72,000 సహాయాన్ని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ భరద్వాజశర్మ, సిద్దయ్య, జగన్మోహన్‌నెడ్డి, రఘుస్వామిరెడ్డి, మాబాషా, కృష్ణనాయక్, పుల్లయ్య, ప్రసాద్, రంగస్వామి, రామారావు, భాస్కర్‌రెడ్డి, బాలుడు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వెలుగోడు: వరదబాధితులకు తమవంతు సాయంగా రూ.45వేలు ఎమ్మార్పీఎస్ నాయకులు విరాళం అందించారు శనివారం వేల్పనూరు గ్రామంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కలసి చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళం అందించిన నాయకులను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయనాయకులు చిలుక రాబిన్సన్, జిల్లా అధికార ప్రతదినిధి బాషపోగుల దరగయ్య, జిల్లా ప్రదానన కార్యదర్శి మదనపల్లి బుజ్జి, నియోజకవర్గం నాయకులు వరదరరాజులు, రామరావు తదితరుల పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



నందికొట్కూరులో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న నందికొట్కూరు సీనియర్ న్యాయాధికారి

ఆత్మకూరు, సెప్టెంబరు 14: ఆత్మకూరు పట్టణంలోని న్యాయస్థానంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 185 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం 185 కేసులకు గానూ ఇందులో 15 క్రిమినల్ కేసులు, 4 సివిల్ కేసులు, 140 సమ్మరీ ట్రైల్ కేసులు, 24 బ్యాంకు కేసులను పరిష్కరించినట్లు వివరించారు. ప్రత్యేకించి బ్యాంకు కేసుల్లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు సంబంధించి రూ.12,01,614, కెనరా బ్యాంకుకు సంబంధించి రూ.లక్ష రికవరీ చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

మహానంది: మహానంది పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన 12 కేసులు లోక్ అధాలత్‌లో పరిష్కారం అయినట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం నంద్యాల్లో జరిగిన లోక్ అదాలత్‌లో మండలంలోని పాత కేసులకు పరిష్కారం లభించిందన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు కోర్టు ఆవరణలో జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో 230 కేసులు పరిష్కారమయ్యాయి. శనివారం నందికొట్కూరు సీనియర్ న్యాయాధికారి ఇందిరాప్రియదర్శిని ఆధ్వర్యంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పలు రకాలకు సంబంధించి 230 కేసులను రాజీ మార్గంలో పరిష్కారమయ్యాయి. ఇందులో రూ.2,18,480 జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు వెంకటరాముడు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

మహానంది, సెప్టెంబరు 14: సేవా కార్యక్రమాలతోనే మంచి గుర్తింపు లభిస్తుందని సెయింట్ ఆన్స్ ఎడ్యుకేషనల్ సంస్థల ప్రెసిడెంట్ మదర్ ఆంథోనమ్మ అన్నారు. శనివారం మహానంది మండలం గోపవరం సమీపంలోని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ డీఎస్ఈ(ఎంఆర్) పదో వార్షికోత్సవం ప్రిన్సిపాల్ సిస్టర్ రీనా జోష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆంథోనమ్మ మాట్లాడుతూ మానసిక వికలాంగులైన విద్యార్థులకు అమ్మ ప్రేమ కన్నా ఎక్కువ మమకారం చూపాలని అన్నారు. ఎంతో ఓర్పుతో వారికి విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు సేవలు చేయడం కళాశాల సిబ్బందికే దక్కిందని కొనియాడారు. ప్రిన్సిపాల్ సిస్టర్ రీనా జోష్ మాట్లాడుతూ విద్య ద్వారా సమాజంలో మార్పుతోపాటు మంచి అవకాశాలు పొంది భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని తెలిపారు. గత పది సంవత్సరాలుగా కళాశాలలో ప్రతిభ చూపిన సిబ్బందిని సన్మానించారు. అనంతరం మానసిక వికలాంగుల విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఎస్ఎస్ఏ ప్రొవిజనల్ సూపర్ వైజర్ అన్నారోజ్, ఫాదర్ రఫైల్, ఫాదర్ ఆంటోనీ, ఫ్రాన్సిస్ కల్యాణీ, సిస్టర్ అనితా లిల్లీసిస్టర్ జోషప్ రాణిలు పాల్గొన్నారు.

గో సంరక్షణ నిధికి విరాళం



దాతకు ప్రసాదాలను అందజేస్తున్న ఏఈవో మోహన్

శ్రీశైలం, సెప్టెంబరు 14: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ నిధి పథకానికి హైదరాబాద్‌కు చెందిన దామినేని శ్రీహర్ష కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,11,111 విరాళాన్ని అందజేశారు. దాత ఈ విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి ఐ.ఎన్.వి మోహన్‌కు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామి, అమ్మవార్ల చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసదాలు అందజేసి సత్కరించారు.

మహానందిలో టీడీపీ కార్యకర్తకు చేయూత



టీడీపీ కార్యకర్త భార్యకు నగదును అందజేస్తున్న శ్రీనివాసులు

మహానంది, సెప్టెంబరు 14: మహానంది గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పోతురాజు మల్లికార్జున గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడ్తున్నాడు. విషయం తెలుసుకున్న మహానందికి చెందిన టీడీపీ నాయకుడు సూరే శ్రీనివాసులు శనివారం కార్యకర్త నివాసానికి వెళ్లి కార్యకర్త భార్యకు రూ.10,500 నగదును అందజేశారు. ఇబ్బందుల్లో ఉన్న కార్యకర్తకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

చిన్నారులను బడికి పంపాలి

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీ శబరి



చెంచులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి, నాయకులు

పాములపాడు సెప్టెంబరు 14: చిన్నారులను అంగన్‌వాడీలకు పంపాలని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. శనివారం మండలంలోని వేంపెంట చెంచు కాలనీలో చెంచులకు ఎంపీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి నిత్యావసర సరుకుల కిట్లు శనివారం పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కాలనీలోని వరదనీరు రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో బియ్యం, ఆయిల్, కందిపప్పులతో కూడిన ఏడురకాల సరుకులు అందించారు. చెంచు విద్యార్థులు పాఠశాలకు వెళ్లడం లేదని ఎంపీకి తెలుపగా విద్యార్థులు పాఠశాలకు వచ్చి చదువుకునేల అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. కొన్ని ఏళ్లుగా గుడిసెలలోనే జీవనం సాగిస్తున్నామని, గృహాలు మంజూరు చేయాలని ఎంపీని కోరారు. స్పందించిన ఎంపీ త్వరలోనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రాథమిక వైద్యశాలను తనిఖీ నిర్వహించి మందుల స్టాక్ నిల్వలను పరిశీలించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి బండ చట్టం పాడైందని దీంతో చిన్నారులకు ఇబ్బంది కలుగకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీడీపీవోను ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మ,కురువ రమేశ్, రవీంద్రరెడ్డి, వేమారెడ్డి, రాజేష్, శివారెడ్డి, నందికుంట మధుసూదన్‌రెడ్డి, జగదీష్ నాయుడు, వలిబాషా, కిరణ్, రామక్రిష్ణలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

పగిడ్యాల, సెప్టెంబరు 14: పగిడ్యాల మాజీ సర్పంచ్ గోవిందు(62) మృతి చెందాడు. శనివారం నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గోవిందు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే పగిడ్యాల మాజీ జడ్పీటీసీ, వైసీపీ నాయకుడు పుల్యాల నాగిరెడ్డి మృతదేహం వద్ద నివాళ్లు అర్పించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు దామోదర్‌రెడ్డి, వాసురెడ్డి, వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు ఉన్నారు.

ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 14: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ నాయకులు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి.ఫరూక్‌ను కోరారు. శనివారం నంద్యాలలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో జేఏసీ నాయకులు సమస్యలపై వినతి పత్రాన్ని మంత్రికి సమర్పించారు. కార్యక్రమంలో సెక్రటరీ అబ్దుల్ జబ్బార్,జేఏసీ రాయలసీమ కోఆర్డినేటర్ శివగంగ ప్రసాద్, నాయకుడు శివశంకర్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడానికి కృషి



టెలి కమ్యూనికేషన్ అడ్వజరీ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన గౌస్‌లాజంను సత్కరిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, సెప్టెంబరు 14: బీఎస్ఎన్ఎల్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని టెలి కమ్యూనికేషన్ అడ్వజరీ కమిటీ డైరెక్టర్‌గా నూతనంగా ఎంపికైన మోమిన్ గౌస్‌లాజం పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టెలి కమ్యూనికేషన్ అడ్వజరీ కమిటీలో తనను డైరెక్టర్‌గా నియమించేందుకు సహకరించిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఆత్మకూరు ప్రాంతంలో బీఎస్ఎన్ఎల్ సేవలను మరింత విస్తృత పర్చడంతో పాటు బీఎస్ఎల్ఎల్ ద్వారా అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చొరవ తీసుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు ముత్తు, నబిరసూల్, షఫివుల్లా, షాలుఫైల్వాన్, యూనిస్, మగ్బూల్‌ఖాన్, మున్నా, తాహీర్‌అలి తదితరులు ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు.

బుద్ధ శాసనాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 14 : బుద్ధ అశోక శాసనాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నంద్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు రెడ్డిపల్లె ఓబయ్య, జిల్లా కార్యదర్శి సింగరి జీవన్‌రాజ్‌లు పిలుపునిచ్చారు. శనివారం నంద్యాలలో బీఎస్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి బీఎస్ఐ నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుద్ధ గయను వైదిక ఆర్య బ్రాహ్మణ పూజారుల నుంచి కాపాడాలని అన్నారు. బుద్ధ శాసనాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు బీఎస్ఐ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వనం శ్రీనివాసులు, డి.శంకర్, దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కృష్ణ, బీఎస్ఐ నాయకులు పాములేటి, సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతుల జాబితా విడుదల



జాబితాలో పేర్లను చూసుకుంటున్న రైతులు

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 14: ఆత్మకూరు మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్ట పోయిన రైతుల జాబితాను ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాలలో శనివారం ప్రదర్శనకు ఉంచినట్లు మండల వ్యవసాయాధికారి విష్ణువర్దన్‌రెడ్డి తెలిపారు. గ్రామ రైతు సేవా కేంద్రాలలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటల జాబితాను అన్ని గ్రామాల రైతు సేవాకేంద్రాలలో సామాజిక తనిఖీ నిమిత్తం ఉంచామని,ఆ జాబితాలో రైతులు తమ వివరాలను సరి చూసుకుని అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లో తమకు తెలియజేయాలన్నారు.

ఏచూరి మృతి తీరని లోటు



సింగరాజుపల్లిలో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొత్తపల్లి, సెప్టెంబరు 14: సీపీఎం పార్టీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటు అని సీపీఎం మండల నాయకులు నక్క స్వాములు, సంజీవరాయుడులు అన్నారు. శనివారం మండలంలోని సింగరాజుపల్లిలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముందుగా వారు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రమేష్ నియామకంపై హర్షం

కొత్తపల్లి, సెప్టెంబరు 14: పాములపాడు మండల టీడీపీ యువ నాయకుడు కురువ రమేష్ కేంద్ర టెలికాం సలహా కమిటీ సభ్యుడిగా నియమించినందుకు కొత్తపల్లి మండల టీడీపీ నాయకులు నాగశేషన్న, రామచంద్రారెడ్డి, గంగన్న, శంకర్‌రావు, శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వారు మాట్లాడుతూ ఆత్మకూరులోని పాములపాడు మండలంలో పార్టీ విజయం కోసం రమేష్ కృషి చేశారన్నారు.

మల్లన్న సేవలో రాజస్థాన్ మంత్రి



ఆలయ ప్రాంగణంలో మంత్రి కన్హయ్య లాల్ చౌదరి

శ్రీశైలం, సెప్టెంబరు 14: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శనివారం రాజస్థాన్ రాష్ట్ర ప్రజా ఆరోగ్య మంత్రి కన్హయ్య లాల్ చౌదరి దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రి కన్హయ్య లాల్ చౌదరికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రత్నగర్భగణపతి స్వామిని దర్శించుకుని అనంతరం మల్లికార్జున స్వామికి అభిషేకం నిర్వహించుకున్నారు.

గాడిచెర్ల సేవలు ప్రశంసనీయం

వెలుగోడు సెప్టెంబరు 14: గాడిచెర్ల హరిసర్వోత్తమరావు సేవలు ప్రశంసనీయమని లిటిల్ ఎంజిల్ హైస్కూల్ కరస్పాండెంట్ ఇమ్మానియేలు, సీనియర్ పాత్రికేయులు జాతీయ సంక్షేమసంఘం రాష్ట్ర కార్యదర్శి రఘురాముడు, టీడీపీ నాయకుడు అమిరంజా, పాత్రికేయులు సుల్తాన్ అన్నారు. శనివారం గ్రంథాలయాల పితా మహుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు 141 జయంతి సందర్భంగా ఆయన విగ్రాహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో గ్రందాలయ అధికారిణి సుమలత, గోగులరాము, శంకరయ్య, నాగేశ్వరరావు, శివుడు పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గాడిచర్ల హరిసర్వోత్తమరావు జయంతి వేడుకలను ప్రజాసంఘాల నాయకులు నాగరాజు, ఎమ్మార్పీఎస్ స్వాములు, మాలమహానాడు జిల్లా నాయకులు కలబండి అంకన్న, సీపీఎం నాయకులు స్వామన్న, జనసేన నాయకులు సాయిక్రిష్ణ, కాంగ్రెస్ నాయకులు షేక్షావలిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు గాడిచర్ల



కోవెలకుంట్లలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న గ్రంథాలయ విశ్రాంత అధికారి, తదితరులు

కోవెలకుంట్ల, సెప్టెంబరు 14: గ్రంథాలయ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు అని గ్రంథాలయ విశ్రాంత అధికారి పల్లె నరసింహారెడ్డి అన్నారు. హరిసర్వోత్తమరావు 141వ జయంతి సందర్భంగా శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని పాతబస్టాండు గ్రంథాలయం శాఖలో గాడిచర్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వెలిగోడులో గాడిచర్ల హరిసర్వోత్తమరావు విగ్రహం ఏర్పాటుకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పల్లె నరసింహారెడ్డి తెలిపారు.

డోన్(రూరల్): దేశం కోసం పని చేసిన మహనీయులను స్మరించుకోవాలని బీసీ సంక్షేమ వసతి గృహం వార్డెన్ ఎస్.మధు అన్నారు. పట్టణంలోని కొండపేట బీసీ బాలుర సంక్షేమ హాస్టల్‌లో గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక సేవా కార్యకర్త మహ్మద్ రఫీ, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం



ఎమ్మెల్యే కోట్లకు విరాళం అందజేస్తున్న రాఘవేంద్రరెడ్డి యువసేన సభ్యులు

ప్యాపిలి, సెప్టెంబరు 14: మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కోట్ల రాఘవేంద్రరెడ్డి యువసేన వరద బాధితుల సహాయార్థం రూ.11వేలు విరాళం సేకరించారు. శనివారం ఈ విరాళం మొత్తాన్ని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి అందజేశారు. సీనియర్ టీడీపీ నాయకులు మాధవరం స్వామి, కోట్ల యువసేనా నాయకులు రామ్‌కుమార్, లక్ష్మీనారాయణ, లక్ష్మన్న, బాలరాజు, చంద్రలు కోట్లను కలిసి విరాళం అందజేశారు.

జాబ్‌మేళా వాయిదా

బనగానపల్లె, సెప్టెంబరు 14: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 18న బనగానపల్లె పట్టణంలో జరగాల్సిన మెగా జాబ్‌మేళా వాయిదా పడినట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాపరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

'స్వచ్ఛతా హి సేవా'ను విజయవంతం చేయండి

కోవెలకుంట్ల, సెప్టెంబరు 14: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు విజయవంతం చేయాలని ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఈఓపీఆర్‌డీ రాధికారెడ్డిలు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబరు ఒకటో తేదీ వరకు ప్రతి గ్రామంలో స్వచ్ఛతాహీ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి పండుగ

డోన్(రూరల్), సెప్టెంబరు 14: మండలంలోని చిన్నమల్కాపురం గ్రామంలో శనివారం ఆంజనేయస్వామి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. రైతుల పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఆంజనేయస్వామి పండు గను ప్రతి యేటా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 14: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు చేసుకోవడానికి ఆదివారం చివరి రోజు అని, తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏవో భూమా జ్యోతి వెల్లడించారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని సూచించారు. మెట్ట, మాగాణి, పంటలతో పాటు, ఉద్యానవన పంటలు సైతం తప్పకుండా పంట నమోదు చేసుకోవాల్సిందేనని ఆమె తెలిపారు.

18న ఇండస్ట్రియల్ పార్కుపై అవగాహన సదస్సు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 14: మండలకేంద్రమైన కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 18న ఇండస్ట్రియల్ పార్కుపై పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీఐఐసీ ఆధ్వర్యంలో కొలిమిగుండ్ల సమీపంలోని కస్తూర్బా పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల స్థాపన కోసం పారిశ్రామిక వేత్తలకు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారులు అవగాహన కల్పిస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 14: మండలంలోని ఆర్.పాంపల్లె - ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హరివరం గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మీనారాయణ ద్విచక్ర వాహనంపై ఆళ్లగడ్డ పట్టణానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆర్.పాంపల్లె గ్రామానికి చెందిన ట్రాక్టర్, ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో లక్ష్మీనారాయణకు తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు గుర్తించి 108కు ఫోన్ చేయగా వారు వచ్చి ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు అవుట్ పోస్టులు



ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగించనున్న బైకులు

డోన్(రూరల్), సెప్టెంబరు 14: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో అవుట్ పోస్టులు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతు న్నాయి. డోన్ డీఎస్పీ పి.శ్రీనివాసులు చొరవతో ట్రాఫిక్ నియంత్రణకు బైకులను తెప్పించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఔట్‌పోస్టులో ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణకు 15 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. అలాగే డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి పట్టణానికి ఒకటి, బేతంచెర్ల పట్టణానికి ఒక్కటి ట్రాఫిక్ పోలీసు పేరుతో బైకులు వచ్చినట్లు డీఎస్పీ తెలిపారు.

ప్రజాధనం దుర్వినియోగం

- నిరుపయోగంగా గ్రామ సచివాలయాలు
- శివారు ప్రాంతాల్లో నిర్మించడమే కారణం

బేతంచెర్ల, సెప్టెంబరు 14: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు, రైతులకు సుపరిపాలన అందిస్తామని రూ.కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన పలు భవనాలు నిరుపయోగంగా మారాయి. కార్యాలయాలను ఆయా గ్రామాలకు దూరంగా, కుంటల్లో నిర్మించడం రైతులకు, ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగం చేసేందుకే నిర్మించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బేతంచెర్ల మండలంలోని 21 గ్రామాల సచివాలయాలు ఏర్పాటు కాగా, వాటిలో ఆర్ఎస్ రంగాపురం-2, అంబాపురం గ్రామ సచివాలయాల నిర్మాణాలు ఇప్పటి వరకు పూర్తి కాలేదు. నిధుల లేమే కారణమన్నట్లు సమాచారం. ఒక్కొక్క గ్రామ సచివాలయ నిర్మాణానికి రూ.43.60 లక్షలు కేటాయించారు. కొన్ని సచివాలయాలు గ్రామానికి దూరంగా ఉండటంతో పూర్తయినా తాళాలు వేసి నిరుపయోగంగా ఉంచారు. అలాగే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తామని ఎనిమిది అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క అర్బన్ ఆస్పత్రి నిర్మాణానికి రూ.17.50 లక్షలు కేటాయించారు. వాటిలో రెండు, మూడు సెంటర్లు పని చేస్తుండగా.. మిగితా హెల్త్ సెంటర్లు నిరుపయోగంగా మారాయి. రైతుల సంక్షేమం కోసం 13 రైతుభరోసా కేంద్రాలను రూ.21.80 లక్షలతో నిర్మాణాలు చేపట్టారు. వాటిలో కూడా కొన్ని ఆర్‌బీకే కేంద్రాలు పని చేస్తుండగా.. మరికొన్ని ఊరి బయట ఉండటంతో నిరుపయోగంగా మారాయి. హెచ్.కొట్టాల గ్రామంలో మూడు భవనాలు కుంటలో నిర్మించారు. కుంట నిండడం వల్ల నీరు ఉండటంతో సిబ్బంది, రైతులు, ప్రజలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఐదేళ్లలో కొలుముల పల్లె గ్రామంలో సచివాలయం, అర్బన్ హెల్త్ సెంటర్, రైతుభరోసా కేంద్రం ఒకే చోట ఊరికి అరకిలోమీటరు దూరంలో ఉండటంతో మూడు భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. అంబాపురం గ్రామంలో గ్రామ సచివాలయం, పాలకేంద్రం నిర్మాణాలు ఐదేళ్లయినా పూర్తి కాకపోవడంతో పాత భవనంలోనే సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో నిర్మించాల్సిన ఆర్‌బీకేలను డోన్ రైల్వేగేటు సమీపంలో ఒకటి, మద్దిలేటి స్వామి రోడ్డులో మరొకటి నిర్మించడం వల్లన ఎలాంటి ఉపయోగం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా నిరుపయోగంలో ఉన్న భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని, అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.



అంబాపురంలో పూర్తికాని గ్రామ సచివాలయం



కొలుములపల్లెలో నిరుపయోగంగా సచివాలయం, ఆర్‌బీకే ఆసుపత్రి

84 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్‌లో పాల్గొన్న ఆళ్లగడ్డ అదనపు ఐదో జిల్లా న్యాయాధికారి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 14: ఆళ్లగడ్డ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 84 కేసులను పరిష్కరించినట్లు అదనపు ఐదో జిల్లా న్యాయాధికారి పీవీవీఎస్ మురళీకృష్ణ శనివారం తెలిపారు. కోర్టు ఆవరణలో రెండు బెంచిలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 6 సివిల్, 50 ఐపీసీ, 13 మోటార్ ఆక్సిడెంట్, 13 ఈపీ, 2 పిఎల్‌సి కేసులు పరిష్కరించినట్లు వివరించారు. వీటన్నింటికి మొత్తం రూ. 1,54,98,873 అవార్డులు ప్రకటించామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

బనగానపల్లె: జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 73 కేసులు పరిష్కరించినట్లు ఇన్‌చార్జి న్యాయాధికారి రాహుల్ అంబేద్కర్ తెలిపారు. ఇండియన్ పీనల్ కేసులు 38, సమ్మరీ ట్రైన్ కేసులు 31, చెక్ బౌన్ కేసులు మూడు పరిష్కారమైనట్లు తెలిపారు. ఏపీపీ మాధవరావు, రఘురాంరెడ్డి, అబ్దుల్ కైఫ్, జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

ఐక్యంగా ముందుకు సాగాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 14: వాల్మీకి జాతి మొత్తం ఐక్యంగా ముందుకు సాగితేనే లక్ష్యాన్ని సాధించగలమని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధికారి ప్రతినిధి పవన్‌గోపాల్, జిల్లా నాయకులు గుజ్జల పెద్దయ్య అన్నారు. శనివారం కొలిమిగుండ్లలో ఎంవీఆర్‌పీఎస్ సమావేశాన్ని నిర్వహించి, నూతన కమిటీని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. కంబగిరిస్వామి, చిన్నదస్తగిరి, లక్ష్మీనారాయణ, వెంకటరమణ, రామ్మూర్తి, చెన్నయ్య, రమణయ్య పాల్గొన్నారు.

అతిసారతో అప్రమత్తంగా ఉండండి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ నాగేంద్ర

దొర్నిపాడు, సెప్టెంబరు 14: అతిసార వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి నాగేంద్ర అన్నారు. శనివారం మండలంలోని క్రిష్టిపాడులోని హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. సిబ్బందికి అతిసారపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తాగునీటిని వేడి చేసి చల్లార్చి తాగితే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. వర్షాలు అధికంగా కురవడం వల్ల నీరు కుంటల్లో నిలిస్తే దోమలు వ్యాప్తి జరిగి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని అన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. దగ్గు, జలుబు, విరేచనాలు, జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని వైద్య సిబ్బందికి తెలియజేశారు. ఆయా గ్రామాల్లోని క్లినిక్‌లలో ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 14: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల బారిన పడకుండా ఉంటామని రామ్‌కో సిమెంట్ యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ పిలుపుమేరకు స్వచ్ఛతా హీ సేవా -2024 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కంపెనీ ఉద్యోగులు, కార్మి కులు పరిశ్రమ ఆవరణంలో మానవహారం నిర్మించి, స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. రెడ్డి నాగరాజు మాట్లాడుతూ అక్టోబరు-2వరకు స్వచ్ఛతా హి కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సులు, పోటీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అడ్మిన్ హెడ్ రామరాజు, మైన్స్ జీఎం అజ్మల్‌అహ్మద్, వెంకట్రామన్, సూర్యకాంత్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ విధానం తొలగింపుపై హర్షం

చాగలమర్రి, సెప్టెంబరు 14: రాష్ట్రంలో సీబీఎస్ఈ సెంట్రల్ సిలబస్ తొలగింపుపై ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్, మండల అధ్యక్షుడు మస్తాన్‌బాషా, ఎస్టీయూ సంఘ నాయకులు హర్షం ప్రకటించారు. శనివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం సెంట్రల్ సిలబస్‌ను తొలగించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులు తొలగినట్లైందని అన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 117 రద్దు పరిచి ప్రాథమిక విద్యను మెరుగు పరచాలని కోరారు. పాఠశాల గ్రాంట్‌లు మంజూరు కాకపోవడంతో ఉన్నత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు ఇబ్బందులు పడుతున్నారని, గ్రాంట్ మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్, మండల ఉపాధ్యక్షుడు వెంకటప్రసాద్, ఎస్టీయూ నాయకులు మహబూబ్‌బాషా, నారాయణరెడ్డి, శేషాద్రి, శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

నాలుగు వేల హెక్టార్లలో పంటల సాగు

చాగలమర్రి, సెప్టెంబరు 14: మండలంలో ఖరీఫ్ సీజన్ కింద 4 వేల హెక్టార్లలో పంటలు సాగు చేసినట్లు ఏవో రంగనేతాజీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 5,100 హెక్టార్లలో సాధారణ విస్తీర్ణం అన్నారు. వరి 769 హెక్టార్లు, మొక్కజొన్న 1,533 హెక్టార్లు, పత్తి 266 హెక్టార్లు, మినుము 420 హెక్టార్లు, పసుపు 137 హెక్టార్లు, మిరప 29 హెక్టార్లు పంటలు సాగు చేశారని తెలిపారు. ఇంకా 2 వేల హెక్టార్లలో వివిధ పంటలను రైతులు సాగు చేయాల్సి ఉందని అన్నారు. వాతావరణం అనుకూలించక పోవడంతో పంట సాగు విస్తీర్ణం తగ్గిందని అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో బోర్లలో భూగర్భజలాలు పెరగడంతో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయని అన్నారు. కేసీ, టీజీపీ కాలువల కింద నీరు ప్రవహిస్తుండటంతో రైతులు వరి నాట్ల సాగులో నిమగ్నమయ్యారని అన్నారు.

రెండు మోటారు సైకిళ్లు ఢీ.. ఇరువురికి గాయాలు

రుద్రవరం, సెప్టెంబరు 14 : మండలంలోని బోనంపల్లె, రుద్రవరం గ్రామాల మధ్య శనివారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బోనంపల్లెకు చెందిన నాగేశ్వరమ్మ, మల్లికార్జున అనే ఇరువురు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

వర్షం కోసం 24 గంటలు భజనలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 14: మండలంలోని పేట్నికోట గ్రామంలో వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ఆలయాల్లో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామ భజన బృంద సభ్యులు 24 గంటలు నిర్విరామంగా భజనలు చేశారు.

అదుపులో అతిసార

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 14: ఆళ్లగడ్డ పట్టణంలో ప్రబలిన అతిసార వ్యాధి అదుపులోకి వచ్చింది. ముందుగా పట్టణంలోని చాంద్‌వీధిలో ప్రబలిన ఈ వ్యాధి ఆదర్శ అభ్యుదయ కాలనీ, సద్దాం కాలనీల్లో ప్రబలింది. దీంతో ప్రజలు ఒకింత భయాందోళనకు గురయ్యారు. ఆళ్లగడ్డ పాతబస్టాండులోని నీటి ట్యాంకుల ద్వారా సరఫరా అయిన నీరు కలుషిత కావడంతో ఈ వ్యాధి ప్రబలిందని ప్రజలు భావించారు. దీంతో జిల్లా వైద్యాధికారులు చాంద్ వీధిలో పర్యటించి నీరు కలుషిత కావడంతోనే వ్యాధి సోకి ఇమాంబి అనే వృద్ధురాలు మరణించిందని మున్సిపాల్టీ అధికారులకు తెలపడంతో ఆ నీటిని బంద్ చేసి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. ఇది ఇలా ఉండగా నిమజ్జనం రోజున గణేశ్ విగ్రహ నిర్వాహకులు పంపిణీ చేసిన చిత్రాన్నం తిన్న చంద్రమోహన్‌కు విరేచనాలు కల్గినప్పటికీ వైద్యశాలకు వెళ్లకపోవడంతో మరణించాడు. మాబుసా అనే వృద్ధుడు గుండెపోటుతో మరణించాడు. వీరందరు డయేరియాతో మరణించారని, వీరి వల్లనే కేసులు పెరిగాయని ప్రజలు ఆందోళనకు గురై కేసులు పెరిగాయి. దీంతో డయేరియా కేసులను నివారించేందుకు వైద్య సిబ్బంది వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

19 కేసులు నమోదు: ఆళ్లగడ్డ పట్టణంలో శనివారం నాటికి 19 డయేరియా కేసులు నమోదయ్యాయి. వైద్య సిబ్బంది చేస్తున్న చికిత్సల వల్ల పది మంది వ్యాధి బారి నుంచి బయట పడగా రెండు కేసులను నంద్యాలకు తరలించారు. మిగిలిన ఏడుగురు చికిత్స పొందుతున్నారు. ఈ కేసులను కూడా రెండు మూడు రోజుల్లో నివారిస్తామని వైద్యులు అంటున్నారు.

మురుగు కాలువలను శుభ్రం చేయాలి: అతిసార ప్రబలకుండా ఉండేందుకు పట్టణంలో మురుగు కాలువలను శుభ్రం చేయాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ఆళ్లగడ్డ పట్టణంలోని కోవెలకుంట్ల రోడ్డులో ఉన్న మురుగు కాలువ నిండి దుర్గంధం వెదజల్లుతోంది. అలాగే రామలక్ష్మీ కొట్టాల, మంగలి కాలనీల్లో మురుగు కాలువలు నిండి ప్రవహిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిపై ఆయా కాలనీ వాసులు అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేదు. భవిష్యత్తులో అతిసార ప్రబలకుండా ఉండేందుకు మున్సిపాల్టీ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



హిందీ టీచర్‌ను సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

చాగలమర్రి, సెప్టెంబరు 14: చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషతో పాటు జాతీయ భాష హిందీ భాషను కూడా మరువరాదని హెచ్ఎం పేర్కొన్నారు. విద్యార్థులు జాతీయ భాష హిందీ భాషను కూడా నేర్చుకోవాలని సూచించారు. అనంతరం హిందీ పండిట్ రజిత, సీఆర్పీ అమీర్‌ఖాన్‌లను హెచ్ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, బాలికలు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత అంజనేయశర్మ

బనగానపల్లె, సెప్టెంబరు 14: నందవరం చౌడేశ్వరీ మాత ఆలయాభివృద్ధికి హైదరాబాదుకు చెందిన దాత అంజనేయ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి రూ.లక్ష విరాళాన్ని అంద జేశారు. శనివారం ఆలయ ఈవో కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ పీవీ కుమార్ సమక్షంలో ఆలయ సిబ్బందికి ఈ విరాళాన్ని దాతలు అందించారు. వీరికి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించాలి

బేతంచెర్ల, సెప్టెంబరు 14: గ్రామీణ వైద్యులు గ్రామాల్లోని ప్రజలకు ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించాలని డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. శనివారం పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, బేతంచెర్ల గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం, సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటేశ్వర మెడికల్ కళాశాల, తిరుపతి, నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ ఎగ్జిక్యూటీవ్ కమిటి సభ్యుడు మద్దిలేటి, క్రాస్ ఫీల్డ్ ఆఫీసర్ రాజు నాయక్, సభ్యులు నాగసురేంద్రగౌడు, గ్రామీణ వైద్యులు వరప్రసాద్, రామాంజనేయులు, మహేష్, బాలకృష్ణ, జయరాముడు, శేషసాయి, మైనింగ్ మేనేజర్ వీర పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.3.13 లక్షలు

బేతంచెర్ల, సెప్టెంబరు 14: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.3.13 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామివారి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.3,13,720ల ఆదాయం దేవస్థానానికి లభించినట్లు ఆయన తెలిపారు.

శిథిలావస్థలో కేసీ పంట కాలువ

చాగలమర్రి, సెప్టెంబరు 14: మండలంలోని మల్లేవేముల గ్రామ సమీపంలో కేసీ పంట కాలువ ముళ్ల కంపలతో నిండుకొని శిథిలావస్థకు చేరింది. కేసీ ప్రధాన కాలువ నుంచి ఆయకట్టుకు నీరందించే పంట కాలువ దెబ్బతినడంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. పంట కాలువలు ముళ్ల కంపలతో నిండుకొని లైనింగ్ దెబ్బతినింది. అధికారులు స్పందించి కేసీ పంట కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



మల్లేవేములలో ముళ్ల కంపలతో నిండుకున్న కేసీ పంట కాలువ

చంద్రబాబుకు కృతజ్ఞతలు



డోన్‌లో సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది

డోన్(రూరల్), సెప్టెంబరు 14: సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ డోన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ నుంచి సెబ్‌ను ఏర్పాటు చేసిన విషయం విధితమే. వీటిని టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో డోన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ జయనాథరెడ్డి, ఎస్ఐ సోమశేఖర్ సిబ్బంది చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆళ్లగడ్డ: సెబ్‌ను ఎక్సైజ్‌శాఖగా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆళ్లగడ్డ సెబ్ సీఐ చంద్రమణి, ఎస్ఐ జిలానీ బాషా, సిబ్బంది సీఎం చంద్రబాబునాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు శనివారం సెబ్ స్టేషన్‌లో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు ఆనందం వ్యక్తం చేశారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



బనగానపల్లెలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బనగానపల్లె, సెప్టెంబరు 14: పట్టణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరికి శనివారం ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఎల్లయ్య, సుబ్బయ్య, సీఐటీయూ మండల నాయకులు దస్తగిరిలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

రుద్రవరం: సీపీఎం నాయకుడు సీతారాం ఏచూరికి సీపీఎం నాయకులు నివాళి అర్పించారు. శనివారం మండలంలోని యల్లావత్తుల గ్రామంలో ఆయన చిత్రపటానికి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకురాలు శాంతమ్మ, నాయకులు సుదర్శన్, వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా, నడిపి హుసేన్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



వాసాపురంలో వేంకటేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, సెప్టెంబరు 14: మండలంలోని వాసాపురం, రుద్రవరంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి లక్ష్మీగోదాదేవి అమ్మవార్లకు శనివారం అర్చకులు గోపీశర్మ శివశర్మలు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తర లివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుంకుమార్చన చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

నరసింహస్వామి ఆలయాల్లో: మండలంలోని నరసాపురం, రుద్రవరం నరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దొర్వి, గుట్టకొండ నరసింహస్వామి ఆలయాల్లో అర్చకులు అభిషేకం చేసి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలిచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.